02-03-2022 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - మేము సంగమంలో భవిష్య సంపాదన కోసం చదువుకుంటాము, తండ్రి మమ్మల్ని చదివించి 21 జన్మల వారసత్వాన్ని ఇస్తారని మీకు నిశ్చయం ఉంది"

ప్రశ్న:- మీపై మీరు కృప లేక ఆశీర్వాదం చేసుకునే విధి ఏమిటి?

జవాబు:- మీపై మీరు కృప లేక ఆశీర్వాదం చేసుకునేందుకు తండ్రి చదివించే చదువును రోజూ చదువుకుంటూ ఉండండి. ఎప్పుడూ సాంగత్య దోషంలోకి వచ్చి చదువులో నిర్లక్ష్యం చేయకండి. ఎవరైతే సదా శ్రీమతంపై నడుస్తారో, వారు తమపై తాము కృప చూపించుకుంటారు, వారికి తండ్రి యొక్క ఆశీర్వాదాలు కూడా లభిస్తూ ఉంటాయి.

గీతము:- నేను ఒక చిన్న పిల్లవాడిని... (మై ఏక్ నన్హా సా బచ్చా హూ...)

ఓంశాంతి. శివ భగవానువాచ, మనుష్యులు గీతను వినిపించేటప్పుడు, ఎల్లప్పుడూ సాకార కృష్ణ భగవానువాచ అని అంటారు. తండ్రి వచ్చి అర్థం చేయిస్తారు, నేను మీకిప్పుడు ఈ రాజయోగం మరియు జ్ఞానం ద్వారా రాజ్యాన్ని ప్రాప్తి చేయిస్తున్నాను. కృష్ణుడైతే సత్యయుగ రాకుమారుడు. గీతలో ఇదే ముఖ్యమైన పొరపాటు. శివ భగవానుడు ఈ శరీరం ద్వారా మనల్ని చదివిస్తున్నారని పిల్లలైన మీకు తెలుసు. శివ జయంతి అని కూడా అంటూ ఉంటారు. అలా జన్మదినాలను కూడా జరుపుకోవడం జరుగుతుంది. ఆత్మకైతే ఒక్క పేరే నడుస్తూ వస్తుంది. తండ్రి అంటారు, నేను గర్భం ద్వారా జన్మ తీసుకోను. నేను సాధారణ శరీరంలోకి ప్రవేశిస్తాను. ఆత్మ ఎప్పుడైతే శరీరంలోకి ప్రవేశిస్తుందో, అప్పుడు లోపల కదలికలు చేస్తుంది. లోపల ఆత్మ ప్రవేశించింది అని తెలుస్తుంది. శిశువు అవయవాలు కదలడం మొదలుపెడతాయి. ఈ విషయాన్ని మంచి రీతిగా అర్థం చేసుకోవాలి. ఇతర మనుష్యులు ఎవరైతే వినిపిస్తారో, వారెప్పుడూ ఇలా అనరు - ఆత్మనైన నేను, మీకు అర్థం చేయిస్తాను అని. వారు శరీరం పరంగా ప్రసిద్ధము. ఈ బాబా అయితే విచిత్రుడు, వీరికంటూ తమ శరీరం లేదు. శరీరధారిని ఎప్పుడూ భగవంతుడు అని అనకూడదు. స్థూల లేక సూక్ష్మ శరీరధారి, ఎవరైనా కావచ్చు! ఆత్మ ఈ ఇంద్రియాల ద్వారా పరమపిత పరమాత్మను స్మృతి చేస్తుంది. వాళ్ళు అయితే కూర్చుని మనుష్యుల ద్వారా తయారుచేయబడిన శాస్త్రాలను వినిపిస్తారు. ఇక్కడ ఇది కొత్త విషయము. భగవానువాచ, ఎవరినైతే భక్తులందరూ ఓ భగవంతుడా అని అంటూ స్మృతి చేస్తారో, ఆ భగవంతుడు ఎవరు? బ్రహ్మ విష్ణు శంకరుల పేర్లు అయితే తెలుసు. ఓ బ్రహ్మా, ఓ విష్ణు అని అంటూ పిలుస్తారు, వారు దేవతలు. భగవంతుడు అని అనడంతో నిరాకారుడే గుర్తుకొస్తారు. నిరాకార పరమాత్మునికే నమస్కారం చేస్తారు. వారంటారు, నేను కూడా ఆత్మనే కానీ సుప్రీమ్ ఆత్మను అనగా పరమ ఆత్మను. నా చిత్రాన్ని కూడా తయారుచేస్తారు. ఆత్మలైన మీ చిత్రాలను కూడా తయారుచేస్తారు. మందిరాలలో పెద్ద శివలింగాన్ని కూడా పెడతారు మరియు చిన్న సాలిగ్రామాలను కూడా, దీని ద్వారా ఆ ఆత్మలు ఒక్క పరమాత్ముని పిల్లలు అని ఋజువు అవుతుంది. తండ్రి ఎల్లప్పుడూ పిల్లల కన్నా పెద్దవారిగా ఉంటారు, అందుకే పెద్ద లింగాన్ని తయారుచేస్తారు. వాస్తవానికి నేనేమీ సాలిగ్రామం అంత పెద్దగా ఉండను. ఆత్మ సైజ్ లో చిన్నగా పెద్దగా ఉండదు. మనుష్యులు చిన్నవారిగా, పెద్దవారిగా ఉంటారు, ఇకపోతే మీ ఆత్మ ఎలా ఉంటుందో, నా ఆత్మ కూడా అలాగే ఉంటుంది. కానీ నా ఆత్మ పరమ, అత్యంత పైన ఉన్న పరంధామంలో నివసించేటువంటిది. ఉన్నతోన్నమైన పరమపిత పరమాత్మ మనుష్య సృష్టికి బీజరూపుడు. బీజం అని రచయితను అనడం జరుగుతుంది. ఎలాగైతే జడ బీజాన్ని వేసినప్పుడు, దాని నుండి మొదట వృక్షం వెలువడుతుంది. అలాగే ఆత్మ రూపం ఎలా ఉందో చూడండి. శరీరం యొక్క విస్తారం ఎంత ఉంది. కనుక మొట్టమొదట కొత్త విషయమేమిటంటే, ఇక్కడ పరమాత్మ తండ్రి చదివిస్తారు. ఉన్నతోన్నతమైన భగవానువాచ కనుక తప్పకుండా పరీక్ష కూడా ఉన్నతోన్నతమైనది ఉంటుంది. భగవంతుడు అంటారు, నేను మీకు రాజయోగం నేర్పిస్తాను, దీని ద్వారా భవిష్య 21 జన్మల కోసం మిమ్మల్ని దేవతలుగా తయారుచేస్తాను. అయితే, వారిలో మీరు సూర్యవంశీయులుగా అవ్వండి లేక చంద్రవంశీయులుగా అయినా అవ్వండి. పదవులైతే చాలా ఉన్నాయి. ఈ రాజధాని అంతా స్థాపన అవుతుంది. ఇది సంగమయుగము. తండ్రి అర్థం చేయిస్తారు, మీరు ఈ జన్మ కోసం చదువుకోవడం లేదు. ఇది భవిష్యత్తు కోసం సంపాదన, మిగిలినవి ఏవైతే చేస్తారో, అవన్నీ ఈ జన్మ కోసమే. భవిష్యత్తు కోసం ఇప్పుడు ఎందుకు ఆలోచించాలి, ఏది జరగాలని ఉంటే అది జరుగుతుంది అని మనుష్యులు భావిస్తారు. మేము భవిష్య జన్మ-జన్మాంతరాల కోసం చదువుకుంటున్నాము అని పిల్లలైన మీరు నిశ్చయం చేసుకుంటారు. తండ్రి రానున్న 21 జన్మల యొక్క వారసత్వాన్ని ఇస్తారు, ఈ నిశ్చయంతో మీరు

చదువుకుంటారు. నిశ్చయం లేకుండా ఎవ్వరూ ఇక్కడ కూర్చోలేరు. ఇక్కడ పండితులు మొదలైనవారెవ్వరూ చదివించరు, నిరాకార భగవంతుడు చదివిస్తారు. మాకు అనంతమైన తండ్రి చదివిస్తున్నారు అని ఆత్మకు సంతోషం కలుగుతుంది. వీరికి తమ మనుష్య తనువైతే లేదు. నిరాకారుడినైన నేను ఈ బ్రహ్మ తనువులోకే రావాల్సి ఉంటుందని స్వయంగా అంటారు. ఇది అనాదిగా తయారై తయారుచేయబడిన డ్రామా. మీకు బుద్ధిలో అంతా గుర్తుకొస్తుంది. మూలవతనంలో ఆత్మలమైన మనం ఉంటాము. మా ఆత్మ పరంధామంలో తండ్రితో పాటు నివసిస్తుంది అని ఇతర ఏ మనుష్యుల బుద్ధిలోకి రాకపోవచ్చు, దానిని బ్రహ్మాండము అని అంటారు. ఆత్మలైన మనం చాలా చిన్న నక్షత్రం వలె ఉంటాము. పూజ కోసం పెద్దగా తయారుచేసారు. ఇకపోతే, ఇంత పెద్ద ఆత్మ ఇక్కడ భృకుటి మధ్యలో కూర్చోలేదు. భృకుటి మధ్యలో అద్భుతమైన సితార మెరుస్తుంది... అని అంటారు. నక్షత్రం ఎంత చిన్నగా ఉంటుంది. ఇది తయారై తయారుచేయబడిన అవినాశీ డ్రామా. ఆత్మలు ప్రతి ఒక్కరిలో తమ-తమ పాత్ర నిశ్చితమై ఉంది, ప్రతి ఒక్కరూ తమ-తమ పాత్రను రిపీట్ చేస్తారు. ఇందులో కొద్దిగా కూడా తేడా రాజాలదు. ఫిల్మ్ లో ఏ పాత్ర అయితే ఒక్కసారి జరుగుతుందో, అది మళ్ళీ రిపీట్ అవుతుంది, ఇందులో పొరపాటు జరగజాలదు. ఈ విషయాలు పూర్తిగా కొత్తవి. కోట్లలో కొందరే అర్థం చేసుకుంటారు. 8-10 సంవత్సరాల వారు కూడా చదువును వదిలేస్తారు, సాంగత్య దోషం అంటుకుంటుంది. ఈ చదువు ఎటువంటిది అంటే, ఎవరు ఎంతవరకు జీవించి ఉంటారో, అంతవరకు (జ్ఞానామృతాన్ని) తాగుతూ ఉండాలి. అంతిమం వరకు ఈ చదువు నడుస్తూ ఉంటుంది. మనం ఈ చదువును భవిష్య 21 జన్మల కోసం చదువుకుంటాము. మమ్మల్ని భగవంతుడు చదివిస్తున్నారు అని పిల్లలకు ఈ నషా ఎక్కుతుంది. ఎవరైనా రాజకుమారుడు ఉంటే మరియు రాజే కూర్చుని అతడిని చదివిస్తే అప్పుడు, మా తండ్రి, మహారాజు, నన్ను చదివిస్తున్నారు అని అంటారు. ఇక్కడ ఉన్నది పతిత-పావనుడైన తండ్రి, వారు మనల్ని చదివిస్తారు. రాజయోగం నేర్పిస్తారు. లోపల సదా చాలా సంతోషం ఉండాలి. మనం గాడ్లీ స్టూడెంట్ (ఈశ్వరీయ విద్యార్థి), గాడ్ ఫాదర్ పరమపిత పరమాత్మ నుండి స్వర్గం యొక్క స్వరాజ్యాన్ని తీసుకుంటున్నాము. ఎంత సహజమైన విషయము. కానీ ఈ చదువులో మాయ విఘ్నాలు కూడా చాలా వస్తాయి. నడుస్తూ-నడుస్తూ చదువును విడిచిపెట్టేస్తారు కూడా. ఈ ఆత్మిక చదువును రోజూ చదువుకోవాల్సి ఉంటుంది, దీని కోసమే ఈ టేప్ మొదలైనవాటి ఏర్పాట్లను చేసారు. మనుష్యులు చదువుకోవడం కోసం అమెరికా, లండన్ కు కూడా వెళ్తారు. ఇక్కడైతే ఇంట్లో ఉండేవారు పూర్తిగా చదువుకోరు. పరమాత్మ మాకు రాజయోగాన్ని నేర్పిస్తున్నారు అని అర్థం చేసుకోరు. భగవంతుడు, వారు త్రిలోకనాథుడు, వరల్డ్ ఆల్మైటీ, ముక్తిదాత, మార్గదర్శకుడు, వారికి ఎంత మహిమ ఉందో చూడండి. కానీ మీలో కూడా చాలా కొద్దిమందికి మాత్రమే తండ్రి గురించి తెలుసు.

ఈ సమయంలో మీరు గుప్తంగా ఉన్నారు. మనం మూలవతనంలో ఉండేవారము అని మీకు తెలుసు, తర్వాత సూక్ష్మవతనం కూడా ఉంది. ఆ సూక్ష్మవతనంలోకి కుమార్తెలు వెళ్తారు. మనుష్యులు సాక్షాత్కారాలు చేసుకుంటారు. మీరైతే ప్రాక్టికల్ గా వెళ్తారు. సూక్ష్మవతనంలో బ్రాహ్మణులైన మీది మరియు దేవతలది మిలనం జరుగుతుంది. అది బ్రాహ్మణులు మరియు దేవతల సంగమము. ఇది బ్రాహ్మణులు మరియు క్షత్రియుల సంగమము. అక్కడకు భోగ్ తీసుకుని వెళ్తారు. అంతిమంలో చాలా సాక్షాత్కారాలు జరుగుతాయి. ఎలాగైతే కన్య పుట్టింటి నుండి అత్తవారింటికి వెళ్ళినప్పుడు, చాలా వైభవంగా సన్నాయి వాయిద్యాలను మోగిస్తారు. అలాగే అంతిమంలో చాలా సాక్షాత్కారాలు జరుగుతాయి. ప్రారంభంలో మీరు చాలా చూసారు, మళ్ళీ చివర్లో కూడా చాలా చూస్తారు. చదువుకుంటూ ఉంటేనే చూస్తారు. ఒకవేళ ఎవరికైనా కర్మబంధనం లేకపోతే, చదువు పట్ల పూర్తి ధ్యానం పెట్టాలి. ఎవరి సంబంధీకులైనా మరణిస్తే, ఇప్పుడు వీరు బాగా చదువుకోగలరు ఎందుకంటే బంధనం తొలగిపోయింది అని భావించడం జరుగుతుంది. ఇప్పుడు బాగా పురుషార్థం చేయండి, మంచి పదవిని పొందండి. ఈ జ్ఞానం చాలా అద్భుతమైనది. తండ్రి కూర్చుని పిల్లలకు అర్థం చేయిస్తారు - వారంటారు, పిల్లలూ, ఇప్పుడు నిర్లక్ష్యం చేయకండి. మాయ మీ దీపాన్ని చాలా త్వరగా ఆర్పివేస్తుంది, అందుకే తండ్రిని మంచి రీతిగా స్మృతి చేయాలి మరియు చదువుకోవాలి. ఎప్పటివరకైతే ఇక్కడ కూర్చుని ఉంటారో, అప్పుడు డైరెక్టుగా వినడంతో నషా ఎక్కుతుంది. బయటకు వెళ్తే నషా మాయమైపోతుంది. ఎలాంటి సాంగత్యమో, అలాంటి రంగు అంటుకుంటుంది. బంధనం లేకపోతే కూర్చుని చదువుకోవాలి మరియు చదివించాలి.

చిత్రాలు చాలా మంచివి తయారుచేయబడ్డాయి. బాబా యుక్తులను రచిస్తున్నారు. గ్రామాల వారు ఎలా నేర్చుకుంటారు! వీరైతే స్లైడ్స్ ద్వారా కూడా నేర్చుకోగలరు. రోజు-రోజుకు అభివృద్ధి జరుగుతూ ఉంటుంది. మీ బుద్ధిలో రోజంతా స్వదర్శన చక్రం తిరగాలి. బుద్ధిలో ఉన్నప్పుడే ఎవరికైనా అర్థం చేయిస్తారు. లేదంటే టీచరు అనుకుంటారు, వీరికి చదువు పట్ల ధ్యాస లేదు, దేహాభిమానం చాలా ఉంది అని. మిత్ర-సంబంధీకులు, శరీర భానం మొదలైనవి

గుర్తుంటాయి, అందుకే ధారణ జరగదు. అప్పుడు మనం అదృష్టంలో లేదు అని అంటాము. ఎంతగా తల బాదుకున్నా కూడా శ్రీమతంపై నడవరు. పిల్లలు అడుగుతారు, బాబా, ఏం జరుగుతుంది? బాబా అంటారు, మీరు సరిగ్గా చదువుకోవడం లేదు, ఇందులో ఆశీర్వాదం యొక్క విషయమేమీ లేదు. నేను చదివిస్తాను, మీపై మీరు చదువుకునే కృప చూపించుకోండి. శ్రీమతంపై నడవడము - ఇదే కృప. నడవడం లేదు అంటే తమపై తాము అకృప చూపించుకొని శపించుకుంటారు. తండ్రి నుండి వారసత్వం తీసుకోకుండా, రావణుడి మతంపై నడుస్తూ స్వయాన్ని శపించుకుంటారు. తండ్రి అయితే వారసత్వాన్ని ఇవ్వడానికి వచ్చారు. చిరంజీవి భవ, జీవిస్తూ ఉండండి అనగా స్వర్గవాసీ భవ అని ఆశీర్వదిస్తారు, స్వర్గాన్నే అమరపురి అని అనడం జరుగుతుంది. అమరనాథుడే ఈ విధంగా ఆశీర్వదిస్తారు. అమరపురి యొక్క దేవతలు పవిత్రంగా ఉండేవారు కదా. హద్దులోని సంబంధాలు మొదలైనవాటి నుండి మోహాన్ని త్యాగం చేయాల్సిందే. ఇప్పుడు బాబా వద్దకు వెళ్ళాలి. బాబా అంటారు, దేహాల పట్ల మోహం వలన మీకు ఇక్కడివారు గుర్తుకొస్తారు, అందుకే దేహీ-అభిమానులుగా అవ్వండి, అప్పుడు అంతిమంలో మీకు ముక్తిధామం మరియు సుఖధామం గుర్తుకొస్తాయి. శాంతిధామము మరియు సుఖధామము, ఇది దుఃఖధామము. ఆది-మధ్య-అంతిమము, కొత్త ప్రపంచము, మధ్యలోని ప్రపంచము మరియు పాత ప్రపంచము. ఎప్పుడైతే సగం సమయం పూర్తవుతుందో, అప్పుడు పాత ప్రపంచం అన్న పేరు మొదలవుతుంది. ఈ పాత ప్రపంచం ఇప్పుడు కొత్తదిగా అవుతూ ఉంది. మళ్ళీ కొత్త ప్రపంచంగా ఎలా అవుతుందో వచ్చి చూడండి, అర్థం చేసుకోండి. కానీ కోట్లలో కొందరే శ్రద్ధ పెట్టి అర్థం చేసుకుంటారు. వేలాది మంది లక్షలాది మంది వస్తారు, అందులో 2-4 మంది వెలువడుతారు, మళ్ళీ ఢీలా అయిపోతారు. ఒక ప్రదర్శినీ నుండి 2-4 నిలిచినా కూడా అహో సౌభాగ్యము. రోజు రోజుకు ఈ ప్రదర్శినీ కూడా వృద్ధి చెందుతుంది. నడుస్తూ-నడుస్తూ ఇక రోజుకు 10 వేల మంది కూడా వస్తారు. పెద్ద-పెద్ద హాళ్ళు, పెద్ద-పెద్ద చిత్రాలు కూడా ఉంటాయి. అర్థం చేయించేవారు కూడా చురుకైనవారిగా ఉంటారు. అంతిమంలో మహిమనైతే వెలువడనున్నది. ఓ ప్రభూ, పతిత ప్రపంచాన్ని పావనంగా తయారుచేసే మీ గతి అన్నింటికన్నా అతీతమైనది అని అంటారు. భక్తి చాలా అలవాటు అయిపోయింది. దివాలా తీసినా లేక ఎవరైనా మరణించినా, గురువులు అంటారు, చూసారా భక్తిని విడిచిపెట్టేసారు అందుకే ఇలా జరిగింది అని. మాయావి విఘ్నాలు వస్తాయి, శ్రీమతాన్ని విడిచిపెట్టకూడదు. మాయ చాలా మోహిని, ఎంత ఫ్యాషనబుల్ గా అయిపోయారు. మా కోసం ఇదే స్వర్గము అని భావిస్తారు. ఇప్పుడు మాయ యొక్క ఆడంబరము ఉంది, రావణ రాజ్యం పడిపోతుంది. సైన్స్ కారణంగా మాయ ఆడంబరము చాలా ఉంది. గాంధీ స్వర్గాన్ని తయారుచేసారని భావిస్తారు. మీకిప్పుడు స్వర్గం యొక్క జ్ఞానం లభించింది కావున ఇప్పుడిది నరకం అని అర్థం చేసుకుంటారు. ఈ రాజ్యం ఎండమావులలోని నీరు వలె ఉంది (దుర్యోధనుడి ఉదాహరణ). ఈ రాజ్యం ఇక పోయినట్లే. ఇది కల్పం యొక్క విషయము. కల్ప-కల్పము కొత్త ప్రపంచం తయారవుతూ ఉంటుంది మరియు పాత ప్రపంచం సమాప్తమవుతుంది. త్రిమూర్తి శివ్ కూడా ఉన్నారు. బ్రహ్మ ద్వారా స్థాపన చేస్తున్నారు, శంకరుని ద్వారా వినాశనం జరగనున్నది. అప్పుడిక ఎవరైతే రాజయోగాన్ని నేర్చుకుంటారో, వారే రాజ్యాన్ని నడిపిస్తారు. దైవీ రాజధానిని స్థాపన చేసి దానిని జన్మ-జన్మాంతరాలు పాలన చేస్తారు. ఇది బుద్ధిలో ధారణ చేయాలి, అప్పుడు సేవ చేయాలి. మీరు సత్యమైన గీత యొక్క పాఠకులు. వినండి, వినిపించండి, ముళ్ళను పుష్పాలుగా చేయండి. మీరు అర్ధకల్పం కోసం దుఃఖం నుండి విముక్తులు అవుతారు. ఎలాగైతే ఆదివారం రోజున అందరికీ శెలవు ఉంటుంది కదా, అలా అర్ధకల్పం మీరు దుఃఖం నుండి, ఏడవడం, పెడబొబ్బలు పెట్టడం నుండి విముక్తులైపోతారు. అచ్ఛా!

మధురాతి మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత, బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1.కర్మబంధనాల నుండి ముక్తులుగా అయి ఆత్మిక చదువును రోజూ చదువుకోవాలి. ఎప్పటివరకైతే జీవించి ఉంటారో, అప్పటివరకు చదువును తప్పకుండా చదువుకోవాలి.

2. హద్దులోని సంబంధాలు, దేహాల పట్ల ఉన్న మోహాన్ని త్యాగం చేసి తమ శాంతిధామాన్ని, సుఖధామాన్ని స్మృతి చేయాలి. సాంగత్య దోషం నుండి స్వయాన్ని సంభాళించుకోవాలి.

వరదానము:- మనసు-బుద్ధి-సంస్కారాలను మరియు సర్వ కర్మేంద్రియాలను నీతి ప్రమాణంగా నడిపించే స్వరాజ్యాధికారీ భవ

స్వరాజ్యాధికారీ ఆత్మలు తమ యోగ శక్తి ద్వారా ప్రతి కర్మేంద్రియాన్ని ఆజ్ఞానుసారంగా నడిపిస్తారు. కేవలం ఈ స్థూల కర్మేంద్రియాలే కాదు కానీ మనసు బుద్ధి సంస్కారాలు కూడా రాజ్యాధికారి యొక్క డైరెక్షన్లు మరియు నీతి ప్రమాణంగా నడుస్తాయి. వారెప్పుడూ సంస్కారాలకు వశమవ్వరు, కానీ సంస్కారాలను తమ వశం చేసుకుని శ్రేష్ఠ నీతితో కార్యంలో ఉపయోగిస్తారు, శ్రేష్ఠ సంస్కారాల అనుసారంగా సంబంధ సంపర్కంలోకి వస్తారు. స్వరాజ్యాధికారి ఆత్మకు స్వప్నంలో కూడా మోసం జరగజాలదు.

స్లోగన్:- నిర్మానత యొక్క విశేషతను ధారణ చేసినట్లయితే సఫలత లభిస్తూ ఉంటుంది.